# నది ఎంత దూరం?



ఇది నా చిన్ననాటి సాహసం గురించిన ముచ్చట. అప్పుడు మా ఇంటికి కొంతదూరంలో ఉన్న చిన్ననదిని చూడాలని నాకు గొప్ప కుతూహలంగా ఉండేది. ఓరోజు ఆ నదిని ఎలాగైనా చూడాలని నిశ్చయించుకున్నాను. అయితే, మా ఇంటికి... నదికి మధ్య ఓ పెద్దకొండ అడ్డుగా ఉంటుంది. దట్టమైన అడవితో నిండిన ఆ కొండ వెనక నది ఒదిగిపోయింది. కంటికి కనిపించనప్పటికి కొండ అవతల నది ఉందని... అది ఎలా ఉంటుందో కూడా నాకు తెలుసు. మరి తెలుసంటే నా కండ్లతో నదిని ప్రత్యక్షంగా అయితే ఎప్పుడూ చూడలేదు. మా ఊరివాళ్ల నుంచి నది గురించి, నదీ నీళ్లలో ఉన్న చేపల గురించి, అందులోని బండల గురించి వినడం మాత్రం జరిగింది! కానీ, ఆ నది నీళ్లను నా చేతితో తాకడం, దాని గురించి ప్రత్యక్షంగా అనుభూతి చెందడం మాత్రం తీరని కోరికగా మిగిలిపోయింది.



